## క్లుప్తంగా

### సిబ్బంది సహకారంతోనే ఆశించిన స్థాయిలో వసూళ్లు



సంబరాలు జరుపుకుంటున్న సిబ్బంది

**మెట్‌పల్లి:** సిబ్బంది సహకారంతోనే ఆశించిన స్థాయిలో ఆస్తి పన్ను వసూలైందని కమిషనర్ మోహన్ తెలిపారు. మెట్‌పల్లి మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూళ్లలో మంచి ప్రతిభ కనబర్చడంతో ప్రభుత్వం అవార్డు ఇచ్చి అభినందించిన సంగతి తెలిసిందే. దీంతో శుక్రవారం కార్యాలయంలో సిబ్బంది సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు, సిబ్బంది సహకారంతోనే 88.83 శాతం పనున్నలు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**కోరుట్లరూరల్:** జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనందరావు అన్నారు. మండలంలోని నాగులపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నల్ల శంకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల మేదా శక్తిని పెంచేది ఉపాధ్యాయులేనన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని అన్నారు. హెచ్‌ఎం శంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, మాజీ ఎంపీపీ సింగిరెడ్డి నారాయణ రెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ రెడ్డి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

**కోరుట్ల రూరల్:** గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రామకృష్ణ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పనుల ప్రదేశంలో కూలీలకు చలువ పందిరి, తాగునీరు, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని, వడదెబ్బ తగులకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఏపీవో మమత తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులను విస్మరిస్తే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏవో

**జగిత్యాల:** వృద్ధులను విస్మరిస్తే కఠిన చర్యలుంటాయని ఆర్డీవో కార్యాలయ ఏవో తఫజ్జుల్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో పలు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 2007 సంరక్షణ చట్ట ప్రకారం వృద్ధులను విస్మరిస్తే జరిమానాతో పాటు జైలుశిక్ష ఉంటుందన్నారు. విచారణకు హాజరు కాని వారిపై సైతం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రకాశ్‌రావు, విశ్వనాథం, కొండయ్య పాల్గొన్నారు.

### శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకం

**గొల్లపల్లి:** శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకమని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని మదీనా మసీదులో సీసీకెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రధాన కూడళ్లలో తప్పనిసరిగా సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్, పోలీసు సిబ్బంది, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



జిల్లా పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**జగిత్యాలరూరల్:** గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని శుక్రవారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తున్నామన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నంబరు 51ని సవరించాలని, పాతపద్ధతిలో కేటగిరీల వారీగా విధులు నిర్వహించాలని, ఆన్‌లైన్‌లో వారి పేర్లు నమోదు చేయాలని తెలిపారు. సీఎం ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీకాంత్, సులోచన, ఎంఏ.చౌదరి, జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, జంగిలి ఎల్లయ్య, రాజేందర్, తిరుపతి, రాజన్న, రాజు, అంజన్న, లచ్చన్న, రాజేశం, భూమయ్య పాల్గొన్నారు.

# నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కులు పంపిణీ చేస్తున్న నర్సింగరావు

**కోరుట్ల:** సీఎంఆర్ఎఫ నిరుపేదలకు వరం లాంటిదని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

**ఆలయాల అభివృద్ధికి కృషి**

**మెట్‌పల్లిరూరల్:** ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. నియోజకవర్గంలోని పురాతన ఆలయాల అభివృద్ధి జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి,మాజీ సర్పంచ్ శ్రీనివాస్,నాయకులు శేఖర్‌గౌడ్, ప్రవీణ్, వీడీసీ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న నరేశ్‌రెడ్డి

**మేడిపల్లి:** భీమారం మండలంలోని గోవిందారం, రాజలింగంపేట, రత్నాలపల్లె గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీని కార్యక్రమాన్ని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ దేశంలోనే ప్రథమమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తోకల నర్సయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉమ్మడి రవి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు..

**కథలాపూర్:** మండలంలోని భూషణరావుపేట, చింతకుంట, పెగ్గెర్ల, కథలాపూర్ గ్రామాల్లో రేషన్‌షాపుల్లో ఉచితంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు వాకిటి రాజారెడ్డి, వంగ మహేశ్, మండల కాంగ్రెస్ నాయకులు గడ్డం స్వామిరెడ్డి, తలారి మోహన్, లోక నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మల్యాల:** మండలంలోని మానాల గ్రామంలో సన్న బియ్యం పంపిణీని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో శనిగరపు తిరుపతి, మ్యాక లక్ష్మణ్, మల్లయ్య, మరాటి బుచ్చయ్య, శ్రవణ్, ముత్తయ్య, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

# ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న ఏవో వినీల

**జగిత్యాలఅగ్రికల్చర్:** జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేటలో శుక్రవారం వ్యవసాయ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వినీల మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం సాగుచేయాలని, రైతులకు లాభదాయకంగా ఉంటుందని, దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ అన్వేష్, రైతులు పాల్గొన్నారు.

**మల్యాల:** ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని, భవిష్యత్‌లో ఆయిల్‌పాం సాగుకే ప్రాధాన్యం లభిస్తుందని మల్యాల మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. శుక్రవారం మల్యాల మండలం రాంపూర్ గ్రామంలో రైతులకు ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో చంద్రదీపక్‌తోపాటు లోహియా, అనిల్, ఏఈఓలు కారుణ్యకుమార్, కె.శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

**రాయికల్:** మండలంలోని ఆలూరు గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై శుక్రవారం మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగుచేసేందుకు ముందుకు వచ్చే రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు ప్రభుత్వం అందజేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో మతాయి, రైతులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

**గొల్లపల్లి:** రాష్ట్ర ఎస్టీ,ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు శుక్రవారం జగిత్యాలకు రాగా, వారిని జగిత్యాల జిల్లా డీవీసీఎం కో – ఆర్డినేటర్ నల్ల శ్యామ్ కలిసి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు.

**మేడిపల్లి:** రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులను తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షుడు బంగారు దీపక్,మాస్టిన్ సంగం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దుల గంగ నరసయ్య ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు చెట్పల్లి లక్ష్మణ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### సమస్యలు పరిష్కరించాలి

**జగిత్యాలరూరల్:** గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులు, పవర్‌పంప్ ఆపరేటర్లు, కారోబార్ల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని శుక్రవారం జిల్లాకు వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శేర్ల రమేశ్ పాల్గొన్నారు.

**ఉచిత బియ్యాన్ని పంపిణీ చేసేది కేంద్రమే**

**రాయికల్:** ఉచిత రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు అన్నారు. మండలంలోని భూపతిపూర్‌లో రేషన్ దుకాణాల వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో రేషన్ బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నామని గుర్తుచేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బూత్ అధ్యక్షుడు బొడ్డుపల్లి జగన్, బందెల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి హామీ పనుల తనిఖీ**

**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల క్వాలిటీ కంట్రోల్ అధికారి మల్లికార్జున్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామలచ్చక్కపేట,ఆత్మనగర్ గ్రామాల్లో జరుగుతున్న పనులను శుక్రవారం తనిఖీ చేసిన ఆయన అధికారులు,కూలీలకు పలు విషయాలపై సలహాలు,సూచనలు చేశారు.పారదర్శకంగా పనులు చేపట్టాలని,అలాగే జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**ఇటుక బట్టీల వేలం**

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వేనంబరు 437లో ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న భూముల్లో ఉన్న 15 ఇటుక బట్టీలతో పాటు మరో నాలుగు ఇటుక బట్టీలను ఈనెల 8న వేలం వేయనున్నట్లు జగిత్యాల రూరల్ ఆర్ఐ భూమయ్య తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష దరావత్ చెల్లించాలని, టెండర్ దక్కించుకున్న వారు మొత్తం డబ్బును ఈనెల 12లోపు చెల్లించాలని పేర్కొన్నారు.

**రోడ్డు ప్రమాద కేసులో ఏడాది జైలు**

**జగిత్యాలజోన్:** వాహనాన్ని అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడిపి 12 గొర్రెల మృతి, ఒకరు గాయపడడానికి కారణమైన ఆదిలాబాద్‌కు చెందిన సంతోష్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ విసీల్‌కుమార్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. అలాగే, గొర్రెల మృతికి పరిహారంగా రూ. లక్ష యజమానికి అందించాలని పేర్కొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**మల్లాపూర్ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రియాంక అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు తీవ్రంగా శ్రమించాలన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు, గేమ్ షోలు, అభినయ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు స్కూల్ డే జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, శ్రీలత, సులోచన, వనిత, నవిత, జ్యోతి, సుగుణ, రజిత, విజయ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సనాతన ధర్మాన్ని కాపాడాలి

**గొల్లపల్లి:** సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గొల్లపల్లి ఎస్సై సతీశ్ అన్నారు. గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లిలో శ్రీరామనవమి సందర్భంగా బీబీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, బీబీకే ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీబీకే ట్రస్ట్ అధినేత బొమ్మెన కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు కట్ట మహేశ్, లీడ్ ఇండియా శిక్షణ సమన్వయ కర్త తాడూరి శ్రీనివాస్ ఆచార్య, తాడూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఉండాలి

**వెల్గటూర్ :** విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలని కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆదర్శ పాఠశాలలో పీఎం శ్రీ యూత్ ఏకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ క్లబ్ నిర్వహించే వివిధ కార్యక్రమాలు, ప్రాజెక్ట్‌ల ద్వారా విద్యార్థులను భవిష్యత్తులో ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ఈ క్లబ్ ఏర్పాటు చేసినట్లు క్రిష్ణప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### కల్లెడ ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు

**జగిత్యాలక్రైం:** జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంగారెడ్డిపై అదే పాఠశాలకు చెందిన విద్యార్థినులు శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌తో పాటు, జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. కుల మత వివరాలు తెలుసుకుని లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ప్రధానోపాధ్యాయుడు గంగారెడ్డిపై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఫొక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

### పొలాలు పరిశీలన

**సారంగాపూర్:** పొలాల్లో ప్రస్తుతం మెడవిరుపు తెగులు, కాండం కుళ్లు తెగుళ్ల ప్రభావం కనిపిస్తున్నాయని, రైతులు అవసరమైన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సారంగాపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలు ప్రస్తుతం గింజ గట్టిపడే దశ, పొట్ట దశలో ఉన్నాయని వరిపైరుపై కాండం కుళ్లు తెగులు, మెడ విరుపు తెగులు లక్షణాలను రైతులకు వివరిస్తూ, వాటికి ఏ మందులు పిచికారీ చేయాలన్నదానిపై వివరించారు. ఆయన వెంట ఏఈవో వెంకటేశ్, రైతులు ఉన్నారు.

### పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

**మల్యాల:** మండలంలోని లంబాడిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మై విలేజ్ షోం ఫేం గంగవ్వ, ఎంఈవో జయసింహారావు, పాఠశాల హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గ్రామ పంచాయతీకి రూ.10.77లక్షల ఆదాయం**

**మల్యాల:** మల్యాల గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ప్లాంట్, డైలీ మార్కెట్, గ్రామ పంచాయతీ భవన కాంప్లెక్స్‌లను గ్రామ ప్రత్యేకాధికారి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో గ్రామ పంచాయతీకి రూ.10,77,490 ఆదాయం సమకూరింది. తైబజార్ ఏడాదికి రూ.3,26,500, వాటర్ ప్లాంట్ 94,710, గ్రామ పంచాతీయ కాంప్లెక్స్ గదులకు రూ.656280 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబు, పాల్గొన్నారు.



**కథలాపూర్:** మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణగోడలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తెలిపారు. విద్యాలయం గేట్ ఎదురుగా ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థినులు అటు వైపు వెళ్తే తీగలు తగిలే ప్రమాదముందన్నారు. అధికారులు చొరవ చూపి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణగోడలు ఏర్పాటు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: నవీన్
ట్రాన్స్‌కో ఏఈ, కథలాపూర్, సెల్ నంబర్: 9440811478

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

# నిధులు మంజూరు చేయాలని వినతి



కేంద్ర మంత్రితో సమావేశమైన ఎంపీ, ఎమ్మెల్యే

**జగిత్యాల:** పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌కు ఎంపీ అర్వింద్‌తో కలిసి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విన్నవించారు. శుక్రవారం ఢిల్లీలో ఆయనతో సమావేశమై అనంతరం మాట్లాడారు. అండర్ డ్రైయినేజీ వ్యవస్థతో పాటు మురికినీటి శుద్ధి ప్లాంట్ సైతం అవసరముందని, రూ.400 కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేయడం జరిగిందన్నారు. యూఐడీఎఫ్ పథకం కింద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఎస్టీపీ సివరేజీ ట్యాంక్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నాయకులు మోరపల్లి సత్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఉన్నారు.

### ఘనంగా మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న నాయకులు, భక్తులు

**మల్లాపూర్:** మండలంలోని రాఘవపేటలో శ్రీ కృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ మేడాలమ్మ, కేతమ్మ సహిత శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్దన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

**సారంగాపూర్:** ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయ ప్రాంగణంలోని అనుబంధ శ్రీరామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 6న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 11.15 గంటలకు స్వామివారి కల్యాణం జరగనుంది. కల్యాణం కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, సిబ్బంది, అర్చకులు పర్యవేక్షిస్తున్నారు.

### హనుమాన్ విగ్రహ పల్లకీసేవ

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేటలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో హనుమాన్ ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఊరేగింపులో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హనుమాన్ భక్తులకు అన్నదానం చేశారు.

# అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు శోచనీయం



ర్యాలీగా వెళ్తున్న రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్

**వెల్గటూర్ :** అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా.రియాజ్ అన్నారు. జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ నినాదంతో శుక్రవారం ఎండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై లోక్‌సభలో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోపిక, వైస్ చైర్మెన్ తిరుపతి, పూదరి రమేష్, గెల్లు శ్రీనివాస్, పోలోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యాంగ రక్షణ బాధ్యత అందరిది**

**కథలాపూర్:** ప్రతీ ఒక్క పౌరుడు రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య అన్నారు. మండలంలోని పెగ్గెర్ల, ఊట్‌పెల్లి గ్రామాల్లో శుక్రవారం జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ పాదయాత్రలు, ప్రతిజ్ఞలు, సమావేశాలు నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరా నిలిపివేత

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పొరండ్ల, కన్నాపూర్, ఇండస్ట్రీయల్ ఫీడర్‌లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.